క్లుప్తంగా

ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చుకోవాలి



అగ్నిమాపక సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్):ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని జిల్లా అగ్నిమాపక అధికారి యోగేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయ ఆవరణలో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవన శైలి విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత, ఇంధన పొదుపు, వ్యర్థాల తగ్గింపు ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. నీటి పొదుపుతో సకల జీవరాశులను రక్షించుకోవచ్చని పేర్కొన్నారు. అటవీశాఖ అధికారులు జాకీర్‌హుసేన్, విజయలక్ష్మి, శ్రీనివాసులు, పరమేశ్వరి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అలుగుతో సీమ సస్యశ్యామలం

నంద్యాల(అర్బన్): సిద్ధేశ్వరం అలుగు ఏర్పాటుతోనే రాయలసీమ సస్యశ్యామలమవుతుందని రాలయసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీన చేపట్టనున్న జల జాగారణ దీక్ష విజయవంతం చేయాలని గురువారం మండలంలోని బిల్లలాపురం, కొత్తపల్లె, పులిమద్ది, మునగాల, భీమవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు భాస్కరరెడ్డి, రఘురామిరెడ్డి, రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సీట్ల కేటాయింపు

నంద్యాల(న్యూటౌన్): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలో పేద విద్యార్థులు చేరేందుకు సీట్లు కేటాయించినట్లు ఎంఈఓ బ్రహ్మంనాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో తక్కువగా దరఖాస్తు చేసుకున్నారనే ఉద్దేశంతో రెండో విడత అవకాశం ఇచ్చారన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు కేటాయించిన పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. మొత్తం 71 మంది ఈనెల 25వ తేదీలోపు ప్రైవేటు స్కూళ్లలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రైవేటు స్కూల్ యాజమాన్యం ఎంఈఓ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ నియామకం

ఉయ్యాలవాడ : స్థానిక జాతీయ ఉపాధి హామీ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంటుగా లక్ష్మన్నను నియమించినట్లు ఏపీఓ రవిప్రకాష్ గురువారం తెలిపారు. అలాగే బీఎఫ్‌టీగా జ్వాలా నరసింహుడును ఉన్నతాధికారులు నియమించినట్లు చెప్పారు. లక్ష్మన్న కొలిమిగుండ్ల మండలం, జ్వాలా నరసింహుడు చాగలమర్రి మండలం నుంచి బదిలీపై వచ్చినట్లు ఏపీఓ వెల్లడించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి మండలం ఎదురుపాడు గ్రామంలో అధికారులు, ఉపాధి సిబ్బంది కుమ్మక్కై పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. మస్టర్లు వేసుకొని ఉపాధి నిధులను స్వాహా చేస్తున్నారన్నారు. ఎంపీడీఓ, ఏపీఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. నాయకులు ఈశ్వరయ్య, స్వాములు, నరసింహానాయక్, కర్ణ పాల్గొన్నారు.

ఆర్‌బీకేలకు ఎరువుల కేటాయింపు



హరివరం ఆర్‌బీకేలో రికార్డులను పరిశీలిస్తున్న హబ్ మేనేజర్

ఉయ్యాలవాడ : కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 2023–24 సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి 72 ఆర్‌బీకేలకు రాష్ట్ర ప్రభుత్వం 10,958 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించిందని వ్యవసాయ శాఖ హబ్ మేనేజర్ రాజేంద్రకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని హరివరం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఈ ఏడాది సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 70,390 హెక్టార్లు కాగా రబీ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 1,27,033 హెక్టార్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు డీఏపి 1,758.2 మెట్రిక్ టన్నులు, పొటాష్ 183, కాంప్లెక్స్ ఎరువులు 5,867, సూపర్ పాస్ఫేట్ 85, యూరియా 3,064 మెట్రిక్ టన్నులు ఆర్‌బీకేలకు కేటాయించారని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో ఆయా కేంద్రాల పరిధిలోని సబ్సిడీ విత్తనాలు, ఎరువులకు రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు సిద్ధిఖ్‌బాషా పాల్గొన్నారు.

పోటా..పోటీ..

- ఉష్ణోగ్రతలతో పోటీ పడుతున్న పండ్ల ధరలు
- వేసవి తీవ్రత పెరగడంతో పెరిగిన వినియోగం
- కొనుగోలుకు వెనుకాడుతున్న సామాన్యులు

నంద్యాల(న్యూటౌన్): ఉష్ణోగ్రతలు, పండ్ల ధరల రేస్ కొనసాగుతోంది. భానుడు నడినెత్తిన నిప్పులు కురిపిస్తున్నాడు. వడగాల్పులు, ఉక్కబోతకు ప్రజలు అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకుంటున్న నేపథ్యంలో నిస్సత్తువ ఆవరించకుండా పోషక విలువలున్న తాజా పండ్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే మార్కెట్‌లో ఆపిల్, దానిమ్మ, పైనాపిల్, కమలా, ద్రాక్ష, బొప్పాయి, అరటిపండు.. పండేదైనా సరే సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎక్కి కూర్చున్నాయి. మండుతున్న ఎండలకు తగ్గట్టే మార్కెట్‌లో పండ్ల ధరలు సైతం సెగలు పుట్టిస్తున్నాయి. ఏ రకమైన పండు కొనాలన్నా వందల్లో రేటు పలుకుతుండటంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు.

పెరిగిన వినియోగం..

వ్యక్తిగత ఆరోగ్యం, పూజా కార్యక్రమాలు, అతిథుల కోసం, పరామర్శలు, శుభకార్యాల నిమిత్తం పండ్లు కొనుగోలు చేస్తారు. పోషక విలువలు ఎక్కువగా ఉన్న తాజా పండ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యం సమతుల్యంగా ఉంటుందని వైద్యులు పదే పదే సూచిస్తున్నారు. పైగా కరోనా తర్వాత పండ్ల వినియోగం బాగా పెరిగింది. కానీ వేసవిని సాకుగా చూపుతూ డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారులు రేట్లు అమాంతంగా పెంచేస్తున్నారని కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు. నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాస సెంటర్, బొమ్మలసత్రం, గాంధీచౌక్, నూనెపల్లె, టెక్కె, సాయిబాబా నగర్ తదితర ప్రధాన ప్రాంతాల్లో పండ్ల వ్యాపారాలకు కేంద్రాలుగా ఉన్నాయి.



వ్యాపారానికి ఉంచిన పండ్లు

మార్కెట్‌లో మంట..

మార్కెట్‌లో వివిధ రకాల పండ్లు అందుబాటులో ఉన్నా వాటి ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పరిమాణాన్ని బట్టి డజను యాపిల్ రూ.300 నుంచి రూ.350, దానిమ్మ రూ.200 నుంచి రూ.250, సుగంధ అరటి పండ్లు రూ.60 నుంచి రూ.80 వరకు, నల్ల ద్రాక్ష కేజీ రూ.120 నుంచి రూ.150, పుచ్చకాయ కేజీ రూ.30 నుంచి రూ.40, బొప్పాయి కేజీ రూ.50, డ్రాగన్ ఫ్రూట్ ఒకటి రూ.100, నేరేడు పండ్లు పావు కిలో రూ.వంద ప్రకారం విక్రయిస్తున్నారు. ఇక అంజూర, తర్బూజా, కమల, తాటి ముంజలు, పైనాపిల్, బత్తాయి పండ్ల ధరలు కూడా ఠారెత్తిస్తున్నాయి.

సామాన్యులకు అందుబాటులో లేవు



ప్రస్తుతం పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. చివరకు వేసవిలో దొరికే పుచ్చకాయ, బొప్పాయి పండ్ల ధరలు సైతం పెరిగి పోయాయి. వేసవిలో ఫ్రూట్ జ్యూస్‌లకు డిమాండ్ ఉండటంతో పండ్ల ధరలు పెరుగుతున్నాయి.

– జయన్న, నంద్యాల

ఖర్చులు పెరగడంతోనే అధిక ధరలు



పండ్లు కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది. వేసవి కావడంతో డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరిగాయి. ముఖ్యంగా పండ్ల పంటల సాగు, రవాణా తదితర ఖర్చులు విపరీతంగా పెరగడంతో దానికి అనుగుణంగానే ధరలు పెరుగుతున్నాయి.

– పెద్దయ్య, పండ్ల వ్యాపారి, నంద్యాల

మాన్యం కౌలుకు వేలం

రుద్రవరం: మండలంలోని బీరవోలు వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 24.79 ఎకరాలకు గురువారం ఈఓ వేణునాథరెడ్డి కౌలు వేలం నిర్వహించారు. రైతులు ఎవరూ పోటీ పడకపోవడంతో తక్కువ వేలంతో కౌలకు ఇచ్చినట్లు ఈఓ తెలిపారు. గతేడాది రూ. 3.26 లక్షలు రాగా ఈ ఏడాది రూ.2.83 లక్షలు వచ్చిందని గతేడాది కంటే రూ.43వేలు ఆదాయం తగ్గిందని చెప్పారు.పర్యవేక్షణ అధికారిగా నరసయ్య పాల్గొన్నారు.

కౌలు కార్డుపై అవగాహన

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె, డబ్ల్యూ.గోవిందిన్నె, కొండాపురం గ్రామాల్లోని ఆర్బీకేల్లో కౌలు కార్డుపై రైతులకు మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కౌలు కార్డు అనేది భూ యాజమాని, సాగుదారునికి మధ్య ఒప్పంద పత్రమేనని, దీని కాలపరిమితి కేవలం 11 నెలలు మాత్రమే ఉంటుందన్నారు. కార్డులో భూయజమాని,సాగుదారు పేర్లు, సర్వే నంబర్,విస్తీర్ణం ఉంటుందన్నారు. దీనివల్ల భూయాజమన్య హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదని స్పష్టం చేశారు. దీనివల్ల కౌలు రైతులకు పంటల బీమా,విత్తనాలు,ఎరువులు, పంట నష్టపరిహారం, వైఎస్సార్ రైతు భరోసా వంటి పథకాలువర్తిస్తాయని వివరించారు.వీఏఏలు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

దొర్నిపాడు:స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ నాగఅనసూయ గురువారం తెలిపారు.మండల స్థాయి అధికారులు ప్రతగి నివేదికలతో రావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.



ఆర్.కొత్తూరులో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం



రాతి గుండు ఎత్తుతున్న దృశ్యం

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు

రుద్రవరం: ఆర్.కొత్తూరు గ్రామంలో చేపట్టిన పట్టాభి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠోత్సవ వేడుకలు గురువారం ముగిశాయి. గ్రామ పెద్దలంతా కలిసి చందాలు వేసుకొని నూతన ఆలయం నిర్మించి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు చేపట్టారు. రెండు రోజుల పాటు వేద పండితులు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. చివరి రోజు పూజా కార్యక్రమాలు, యంత్ర ప్రతిష్ఠ, పట్టాభిరామస్వామి పరివార దేవతల స్థిర ప్రతిష్ఠ, బింబ కళాన్యాసం, ప్రాణ ప్రతిష్ఠ, బలి ప్రదానం, కుంభాభిషేకం, సర్వదర్శనం వంటివి జరిపించారు. అ నంతరం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం చేశారు. ఈ సందర్భంగా రాతి గుండు ఎత్తే పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో నంద్యాల క్రీడాకారులకు పతకాలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించారని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెనాలిలో ఈనెల 21, 22 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ క్లాసిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో నంద్యాలకు చెందిన క్రీడాకారులు ఐదుగురు పతకాలు సాధించారని చెప్పారు. పల్లవి, 43 కేజీల విభాగం బెంచ్ ప్రెస్‌లో బంగారు పతకం, పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం, లక్ష్మినరసింహ 53 కేజీల విభాగం బెంచ్ ప్రెస్‌లో బంగారు పతకం, మహేష్‌బాబు బెంజ్ ప్రెస్‌లో రజత పతకం, 83 కేజీల జూనియర్ విభాగంలో రోహిత్‌వర్మ, బెంచ్‌ప్రెస్‌లో రజత పతకం, పవర్‌లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించగా, రాజు 83 కేజీల జూనియర్ విభాగం బెంచ్ ప్రెస్‌లో బంగారు పతకం అందుకున్నాడని వివరించారు. క్రీడాకారులు అక్టోబర్‌లో హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటారని చెప్పారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్, కార్యదర్శి కూరప్రసాద్, కోశాధికారి రత్నకుమార్ పాల్గొన్నారు.



క్రీడాకారులను సత్కరిస్తున్న రవికృష్ణ

పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో అందజేస్తున్న పచ్చిరొట్ట ఎరువులు జీలుగ, జనుము విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ స్వప్నికారెడ్డి కోరారు. మండలంలోని చాపిరేవుల గ్రామంలో గురువారం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నంద్యాల మండలానికి 360 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు మంజూరయ్యాయని, ఒక్కో రైతుకు ఎకరానికి 5 కేజీల చొప్పున ఐదు ఎకరాలకు అందజేస్తామని చెప్పారు. అవసరమైన రైతులు స్థానిక ఆర్‌బీకే కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎండీ రఫీ కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో వినోద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కళాశాలల్లో అనుమతులు లేకుండా ముందస్తుగా అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను యాజమాన్యాలపై మోసం చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు దస్తగిరి, నవీన్, వెంకటేష్, హరి, వంశీ, వినయ్ పాల్గొన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం

శిరివెళ్ల: స్థానిక శ్రీ ఓంకారేశ్వరస్వామి ఆలయ మాన్యం కౌలుకు గురువారం బహిరంగ వేలం పాటలు జరిగాయి. పోటా పోటీగా జరిగిన వేలంలో ఆలయానికి ఆదాయం లభించింది. ఈ ఏడాది 51 ఎకరాలకు గాను రూ.5.53 లక్షలు ఆదాయం వచ్చింది. గతేడాది రూ. 2.14 లక్షలు పలికింది. వేలం పర్యవేక్షణాధికారిగా శ్రీ సర్వనరసింహ్మస్వామి ఆలయ ఈఓ నర్సయ్య వ్యవహరించగా, ఈఓ వేణునాథరెడ్డి, చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌పై దాడి

ఆళ్లగడ్డ: పట్టణంలో ఓ లారీ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. పులివెందులకు చెందిన లారీ డ్రైవర్ శీను లోడు దించేందుకు ఆళ్లగడ్డకు రాగా గురువారం పట్టణానికి చెందిన ప్రతాప్ అతడితో గొడవపడి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రతాప్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కృష్ణానదిలో వ్యక్తి గల్లంతు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ దిగువ భాగంలోని లింగాలగట్టు వద్ద నీటిలో మునిగి ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం, గుడిజేపల్లి గ్రామానికి కందుల వెంకటేశ్వరరెడ్డి(40) గురువారం సాయంత్రం గల్లంతయ్యాడు. గుంజాపల్లి నుంచి బంధువులు, స్నేహితులతో కలిసి ఒక ప్రైవేట్ వాహనంలో బుధవారం శ్రీశైలం వచ్చారు. స్వామివార్లను దర్శించుకున్నారు. గురువారం ఉదయ తెలంగాణ ప్రాంతంలోని మద్దిమడుగు ఆంజనేయస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో లింగాలగట్టు వద్ద కృష్ణానదిలో స్నానమాచరించడానికి దిగారు. వెంకటేశ్వరరెడ్డి నదిలో ఈత కొడుతూ ఉండగా ప్రవాహానికి నీటమునిగిపోయాడు. ప్రమాదం జరిగిన ప్రాంతం తెలంగాణ రాష్ట్రం దోమలపెంట మండలం పరిధిలో ఉండడంతో తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేసుకుని గల్లంతైన వ్యక్తికోసం గాలిస్తున్నారు.

వెదురు బొంగుల స్వాధీనం

వెలుగోడు: నల్లమల అటవీ ప్రాంతంలో అక్రమంగా వెదురు బొంగులు తరలిస్తుండగా అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రేంజ్ పరిధిలోని బేస్ క్యాంపు సమీపంలో ఐదుగురు వ్యక్తులు సైకిళ్లపై వెదురు బొంగులు తరలిస్తుండగా అటవీ అధికారులను చూసి వారు సైకిళ్లు వదిలి పరారు అయ్యారు. వెలుగోడు రేంజ్ అధికారి ఎంఏ ఖాన్, సిబ్బంది వారి కోసం గాలించగా అచూకీ లభ్యం కాలేదు. వెదురు బొంగులు, సైకిళ్లను కార్యాలయానికి తరలించారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయండి

రుద్రవరం: నాడు-నేడు పనులను వేగవంతం చేయించాలని ఎంఈఓ కోటయ్య హెచ్‌ఎంలకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం నాడు-నేడు కింద ఎంపిక అయిన పాఠశాలల హెచ్‌ఎంలు,అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 12 లోపు అసంపూర్తిగా ఉన్న పనులన్నింటినీ పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రధానంగా బడికి వచ్చే విద్యార్థులు వసతులు లేక ఇబ్బంది పడకూడదని చెప్పారు. ఏఈ మధుసూదనరెడ్డి, ఏపీఎం కల్పలత ఉన్నారు.



హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న ఎంఈఓ

పథకాల అమలులో వలంటీర్లది కీలక పాత్ర

దొర్నిపాడు: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ వలంటీర్లకు కీలకపాత్ర కల్పించారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక సహకార సంఘం ఆవరణలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పింఛన్‌దారులు నెల వచ్చిందంటే పడిగాపులు కాయాల్సి వచ్చేదని, మన ప్రభుత్వం వచ్చాకా ఇంటివద్దకే తలపుతట్టి మరీ వలంటీర్లు పింఛన్ ఇస్తుంటే లబ్ధిదారులు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు ప్రజలకు కల్లిబొల్లిమాటలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారని, వాటిని వలంటీర్లు తిప్పికొట్టాలన్నారు. పెట్రోల్, గ్యాస్, ఆయిల్, నిత్యవసరాలు వంటి ధరలు వైఎస్సార్‌సీపీ పెంచిందని ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయని, ధరల నియంత్రణ కేంద్రం పరిధిలో ఉంటుందనేది వారికి తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలను మాయమాటలతో మోసం చేసేందుకు బాబు అండ్‌కో ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. ఎంపీడీఓ నాగ అనసూయ, తహసీల్దార్ జయప్రసాద్, జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తులనాగేశ్వరావు, నాయకులు కాశీవిశ్వనాథ్‌రెడ్డి, బబ్బూరి కృష్ణ, వెంకటస్వామి, మనోహర్‌రెడ్డి, బత్తుల కృష్ణయ్య, లక్ష్మిరెడ్డి, డీలర్ శివుడు, చంద్రశేఖర్‌రెడ్డి, శాంతయ్య, జాకీర్, రఫీ, విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచులు ఉమాదేవి, శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, శివారెడ్డి, డీలర్ పెద్దన్న, వెంకటరామిరెడ్డి, శ్రీపతి ప్రసాద్, పాదం శ్రీను, శంకర్‌రెడ్డి, భూమా శ్రీనివాసరెడ్డి, బ్రహ్మయ్య, రత్నబాబు పాల్గొన్నారు.



దొర్నిపాడులో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

వైద్యుల నియామకానికి నేడు ఇంటర్వ్యూలు

నంద్యాల టౌన్ : నంద్యాలలో ప్రారంభం కాబోతున్న మెడికల్ కళాశాల, సర్వజన ఆసుపత్రిలో సీనియర్ రెసిడెంట్ వైద్యుల నియామకానికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.స్వర్ణలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఓబిజి, అనస్తీషియా, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, ఫల్మనాలజీ, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మాలజీ, పెథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పది మార్క్స్ లిస్ట్, ఎంబీబీఎస్, పీజీ డిగ్రీ, రిజిస్ట్రేషన్, పీజీ మార్క్స్ లిస్ట్, సోషల్ స్టేటస్, ఆధార్‌లతో పాటు 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు.

వేడుకగా పెద్దమ్మ జాతర

ఆళ్లగడ్డ: మండలంలోని జిజమ్ములదిన్నె గ్రామలో పెద్దమ్మ జాతర వేడుకలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి గ్రామంలో మొదలైన వేడుకలు అర్ధరాత్రి అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలకరించి కొలువుంచారు. తెల్లవారు జామున బలి దానం ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టి అమ్మవారిని శాంతింపజేశారు. గురువారం ఉదయం గ్రామస్తులు కుటుంబ సమేతంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేపట్టారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి ఉన్నారు.

గృహ నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు రద్దు

చాగలమర్రి:పట్టణంలోని జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో గృహ నిర్మాణాలు ప్రారంభించకపోతే పట్టాలు రద్దు చేస్తామని తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల చివరి నాటికి గృహ నిర్మాణ పనులు ప్రారంభించకుంటే వారి పట్టా రద్దు చేసి 90 రోజుల తరువాత ఇతర లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. లే అవుట్లలో ఇప్పటికే ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించిందని పేర్కొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్‌ను వినియోగించుకోండి

గోస్పాడు: ప్రజలు ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి శాలినీ, డాక్టర్ గోపాల్ తెలిపారు. మండలంలోని ఎం.చింతకుంట్ల గ్రామంలో గురువారం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

వడ్డెమానులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

నందికొట్కూరు రూరల్ : వడ్డెమాను గ్రామంలో ఈ నెల 27, 28వ తేదీలలో జిల్లా స్థాయి పురుషుల ఓపెన్ టు ఆల్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సగినేల సుబ్బన్న తెలిపారు. గ్రామంలోని పరిశుద్ధ మత్తయి దేవాలయం పదో వార్షికోత్సవం సందర్భంగా పోటీలను నిర్విహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు అందజేస్తామన్నారు.

నవరత్నాలతో పేదల గడపలో కాంతులు



వృద్ధుడికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో పేదల గడపలో వెలుగులు విరబూశాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక 3వ గ్రామ సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ తిరిగి పథకాల అమలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన సుధీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ఆదర్శంగా నిలిచారన్నారు. నిలువ నీడ లేని పేదలకు ఇస్తున్న స్థలాలపై చంద్రబాబు విమర్శించడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. బి. అబ్దుల్ సలాం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఎంపీపీ నాయక్ వసీం, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, హిస్టరీ అకాడమీ స్టేట్ డైరెక్టర్ హఫీజ్, దేవస్థానం చైర్మన్ తిమ్మరాయుడు, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘువరెడ్డి, నాయకులు ఇందూరి ప్రతాపరెడ్డి, ముల్లా అన్వర్‌బాషా, దొర్నిపాటి రఫీ, ముడిమేల నాగరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీలో చేరిక

శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన టీడీపీకి చెందిన పలువురు కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదాం గారి వాజీద్, నూర్ హఫీజ్, జహంగీర్, రాహీన్, బుదెంషాగారి ఖాసీం, మస్తాన్, మాబుకు చెందిన కుటుంబాలు పార్టీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

29న విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


నంద్యాల(న్యూటౌన్): ఈనెల 29వ తేదీన మండలంలోని మిట్నాల గ్రామంలో నూతనంగా నిర్మించిన గణపతి,విశ్వేశ్వర వీరభద్ర ఉమాసమేత నాగలింగేశ్వర, ధ్వజ, బసవేశ్వర అభయాంజనేయ స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర, కుమారస్వామి, సరస్వతి, నవగ్రహ, కాల బైరవ, శిఖర ప్రతిష్ఠో మహోత్సవ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొమ్మిరెడ్డి రామసుబ్బారెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 29న ఉదయం హోమాలు, 30న దేవతలకు పూజలు, 31న విగ్రహమూర్తులకు అభిషేకాలు, ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా అన్నదానంతో పాటు నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎద్దుల పోటీలు..

కొప్పుల శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో 29న ఆరు పండ్ల విభాగం రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విజేతలకు వరుసగా.. రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేస్తారన్నారు. అలాగే 30న న్యూ కేటగిరి విభాగంలో విజేతలకు రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.30వేలు, రూ.10వేలు ఇస్తారని వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, వివరాలకు సెల్ : 8309076669, 9989883181లలో సంప్రదించాలని కోరారు.

ఉరుసు ఐకమత్యంగా జరుపుకోండి

గోస్పాడు: హజరత్ హుసేన్‌సావలి ఉరుసు మహోత్సవాన్ని ఐకమత్యంతో నిర్వహించుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని సాంబవరం గ్రామంలో ఉరుసు సందర్భంగా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు కలిసి మెలిసి నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. బుధవారం రాత్రి స్వామి వారికి గంధోత్సవం నిర్వహించి, జెండాను ఊరేగించారు. పూజల అనంతరం పీపీ నాగిరెడ్డిని సన్మానించారు. నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీపీ నాగిరెడ్డి

పెనుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు

నంద్యాల(అర్బన్): బుధవారం రాత్రి పెనుగాలులతో కూడిన వర్షం కురవడంతో జిల్లాలోని పలు మండలాల్లో విద్యుత్ తీగలు తెగిపడటం, స్తంభాలు నేలకొరిగాయి. పెను గాలులు వీయడంతో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. జిల్లా కేంద్రంతో పాటు నంద్యాల మండలం, గోస్పాడు, మహానంది, బండిఆత్మకూరు, వెలుగోడు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, అవుకు తదితర మండలాల్లో చెట్లు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బందితో చెట్లను తొలగించి విద్యుత్ తీగలను సరి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమణారెడ్డి తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం